ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్ కట్..!

- రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి చేసిన ప్రభుత్వం
- అయిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాల్సిందే
- 80 ఏళ్లు దాటిన వారికి మినహాయింపు
- ఆధార్ లింకేజ్, ఇతర తప్పుల కారణంగా కొందరికీ ఈకేవైసీ కాని వైనం
- ఈనెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోకపోతే రేషన్ నిలిపివేస్తామంటున్న అధికారులు



పోలాయవలస రేషన్ డిపో వద్ద ఈకేవైసీ కోసం వేచి ఉన్న రేషన్ లబ్ధిదారులు

గుర్ల: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ దుకాణాల నుంచి బియ్యం, ఇతర సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారుల ఈకేవైసీ నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. లబ్ధిదారుల్లో అయిదేళ్లు దాటిన వారందరికీ ఈకేవైసీ చేయించే బాధ్యతను రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. 80 ఏళ్లు దాటిన లబ్ధిదారులకు ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చారు. లబ్ధిదారుల్లో మృతి చెందిన వారిని, డబుల్ ఎంట్రీలను తొలగించడానికి ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపడుతోంది. కొద్ది రోజులుగా రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు ఈ-పాస్ మిషన్ల ద్వారా లబ్ధిదారుల బయోమెట్రిక్ సేకరించి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. లబ్ధిదారుల్లో కొందరికి మాత్రం ఈకేవైసీ చేయించుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. రేషన్‌కార్డులో వారి పేర్లు సక్రమంగా ఉన్నప్పటికీ వాటికి ఆధార్ నెంబర్ తప్పుగా లింక్ కావడం, ఒకరి పేరుకి వేరొకరి ఆధార్ లింక్ అయ్యి ఉండడం వంటి సమస్యల వల్ల ఈకేవైసీ కావడం లేదు. ఆధార్ కేంద్రాలకు వెళ్లి రెండు, మూడుసార్లు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకున్నప్ప టికీ, రేషన్‌కు సంబంధించి ఈకేవైసీ కావడం లేదని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. రేషన్ డీలర్ల వద్ద ఉన్న పీఓసీ ఎలక్ట్రికల్ మిషన్‌లో కూడా ఆధార్ చివరి నాలుగు నెంబర్లు మాత్రమే కనిపిస్తుండడంతో ఆ నెంబర్ తప్పుగా పడిందా లేదా వేరే ఎవరిదో అనే సంగతి కూడా తెలియడం లేదు. ఆధార్ నెంబరు తప్పుగా నమోదైన వారు నిజమైన అర్హులైనప్పటికీ అనర్హులుగానే గుర్తించే అవకాశం ఉంది. లబ్ధిదారులంతా తప్పనిసరిగా ఈనెల 30వ తేదీలోగా ఈకే వైసీ చేయించుకోవాలని ప్రభుత్వం షరతు విధించింది. ఏకారణాల చేతనైనా ఈకేవైసీ కాకపోతే వారికి రేషన్ నిలిపివేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆధార్ నెంబర్‌లు తప్పుగా నమోదు కావడం వల్ల ఈకేవైసీ కావడం లేద ని, ప్రభుత్వం తమకు ఆధార్ నంబర్లను సరిచేసుకునే అవకాశం ఇవ్వాలని, అలా కాకుండా ఈకేవైసీ పూర్తి కాకపోతే రేషన్ నిలిపివేస్తామని చెప్పడం సరికాదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

చీపురుపల్లి నియోజకవర్గంలో రేషన్ కార్డులు, లబ్ధిదారులు, ఈకేవైసీ వివరాలు

మండలం	రేషన్ కార్డుల సంఖ్య	లబ్ధిదారులు	ఈకేవైసీ పూర్తయిన వారు	పెండింగ్
చీపురుపల్లి	17,907	52,539	48,413	3,006
గుర్ల	20,561	58,749	54,526	3,100
గరివిడి	20,800	58,705	54,422	3,018
మెరకముడిదాం	17,627	49,612	46,006	2,717
80 ఏళ్ల దాటిన లబ్ధిదారుల సంఖ్య: 140				

పదిరోజులుగా తిరుగుతున్నా..

ఆధార్ నెంబర్ తప్పుగా నమోదు కావడంతో పది రోజులుగా రేషన్ డీలర్ చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఈకేవైసీ అవ్వడం లేదు. ఆధార్ కేంద్రంలో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.డీలర్‌ను అడిగితే ఆధార్ నెంబర్‌ను సరిచేసే ఆప్షన్ తనవద్ద లేదని చెబుతున్నారు. అధికారులేమో ఈకేవైసీ కాకపోతే రేషన్ నిలిపివేస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– కెల్ల లక్ష్మణరావు, కెల్ల

సమస్య మా దృష్టికి రాలేదు

రేషన్ కార్డులకు ఆధార్ నెంబర్‌లు తప్పుగా లింక్ నమోదు అయ్యాయని ఇప్పటి వరకు ఎవరూ మాదృష్టికి తీసుకురాలేదు. ఆధార్ ఎడిట్‌కు ఆప్షన్ ఇవ్వలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ, గరివిడి

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న మండలపరిషత్ ఏఓ వరప్రసాద్

గుర్ల: కెల్ల జంక్షన్ వద్ద సచివాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల పరిషత్ ఏఓ ఏ.వరప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వాహనచోదకులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. చలివేంద్రాల ఏర్పాటు కు స్వచ్ఛంద సంస్థలు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కెల్ల పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, స్థానిక నాయకులు కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు పాల్గొన్నారు.

పురిటిపెంటలో 104 వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: మండల కేంద్రంలోని పురిటిపెంట గ్రామ సచివాలయం-2లో మంగళవారం 104 వైద్య శిబిరం నిర్వహిం చారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి 63 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచి తంగా మందులు అందజేశారు. వేసవి నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వైద్యాధికారి సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాతా,శిశు మరణాలు తగ్గించాలి



వియ్యంపేట పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు యూనిఫాం అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

కొత్తవలస: మాతా,శిశు మరణాలు జరగకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌ఓ) ఎస్.జీవనరాణి వైద్య సిబ్బందికి సూచించారు.మండలంలోని కొత్తవలస,వియ్యంటపేట పీహెచ్‌సీల్లో మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. వివిధ సర్వేలు, ఓపీ, ఐపీ, ప్రసవాలకు సంబంధించిన రికార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్‌లను పరిశీలించారు.అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆశ కార్యకర్తలకు యూనిఫాం అందజేశారు. డీఎంహెచ్‌ఓ వెంట వైద్యాధికారులు సీతల్‌వర్మ, గోపాలకృష్ణ, సీతామహాలక్ష్మి, సింహాద్రినాయుడు ఉన్నారు.


ఉపాధి వేతనాలు అందడం లేదు



వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండల కేంద్రంలోని రాజుల చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వేతన దారులు, మేట్లు తమ సమస్యలను రఘురాజుకు వివరించారు. వేతనదారులు మాట్లాడు తూ ఎనిమిది వారాల పనులకు సంబంధించిన వేతనాలను ప్రభుత్వం చెల్లించకపోవడం తో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మేట్‌లు మాట్లాడుతూ సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం వల్ల సకాలంలో మస్తర్లు వేయలేక పోతున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ వెంట ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి ఉన్నారు.

ఏపీఓల బాధ్యతల స్వీకరణ



దత్తిరాజేరు ఏపీఓ కామేశ్వరరావు



గుర్ల ఏపీఓ రత్నమాల

దత్తిరాజేరు/గుర్ల: దత్తిరాజేరు, గుర్ల మండలాల ఉపాధి హామీ పథకం ఏపీఓలుగా బి.వి.వి.కామేశ్వరరావు, ఎస్.రత్నమాల ఆయా మండలాల ఉపాధి కార్యాలయాల్లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దత్తిరాజేరు ఏపీగా ఇదివరకు పనిచేసిన అప్పలనాయుడుకు ఎస్.కోటకు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో గుర్ల నుంచి కామేశ్వరరావు బదిలీపై వచ్చారు. పూసపాటిరేగ నుంచి రత్నమాల గుర్లకు బదిలీపై వచ్చారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి మురళి

బొండపల్లి: రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్రాంత ఐపీఎస్ అధికారి జె.మురళి అన్నారు. మండల కేంద్రంలో శ్రీరామచంద్ర మిషన్, హార్ట్ వెల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న యోగా శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమాజంలో చాలామంది మానసిక ఒత్తడికి గురవుతున్నారని, ఈ సమస్య నుంచి బయట పడాలంటే తప్పనిసరిగా రోజూ కొద్ది సేపు యోగాతో పాటు ధ్యానం చేయాలన్నారు. అలాగే ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రతో పాటించాలని, పర్యావరణ పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నిర్వాహకులు జె.వి.ఎస్.ఎన్.రాజు, జె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నిక



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక కోర్టులో సీనియర్ న్యాయవాదులు, ఎం.చంద్రశేఖర్,ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా జి.సూరిదేముడు, ఉపాధ్యక్షుడిగా కొట్టి వెంకటరావు, కార్యదర్శిగా బి.వి.ఎస్.రామారావు, సంయుక్త కార్యదర్శిగా బి.రామకృష్ణ, కోశాధికారిగా బి.త్రిమూర్తులు, మీడియా కార్యదర్శిగా డబ్ల్యూ.ఎస్.శర్మ, లైబ్రరీ సెక్రటరీగా ఆర్.సత్యనారాయణ,ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా టి.వి.ఆర్.మూర్తి, జి.చిట్టిబాబు, వి.శ్రీనివాసరావు, బి.శివశేఖర్, ఎన్.సత్యనారాయణ, వై.లక్ష్మిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి న్యాయమూర్తి సబ్బవరపు వాణి అతిథిగా హాజరయ్యారు. నూతన కార్యవర్గానికి న్యాయమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

● నోట్, పాఠ్య పుస్తకాల పంపిణీ



గుర్ల : విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, అధ్యాపకులు



వేపాడ: నోట్ పుస్తకాలతో విద్యార్థులు



శృంగవరపుకోట : విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ అప్పారావు, ఎస్.కోట మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఉన్న ఇంటర్ ఉమెన్స్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌కుమార్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

– వేపాడ/శృంగవరపుకోట/గుర్ల

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



డాక్టర్ వరలక్ష్మిని సన్మానిస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పట్టణానికి చెందిన స్నేహ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు మళ్ల రామకృష్ణ అన్నారు. స్నేహ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవాన్ని స్థానిక ధారగంగమ్మ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగిని బి.సూర్యలక్ష్మి, వివిధ రంగాల్లో పెద్ద హోదాల్లో పనిచేస్తున్న మహిళలు డాక్టర్ పి.వరలక్ష్మి,జి.శ్రీదేవి,ఎం.అజితారాగ్ని,కుమారి మంజీరా కిషోర్, ఏ.హారణి, కె. వైష్ణవి హాజరయ్యారు. వీరంతా ఆధునిక సమాజంలో మహిళల పాత్ర అన్న అంశంపై ప్రసంగించారు. అనంతరం అతిథులను స్నేహ సంస్థ కార్యదర్శి మంథా సుబ్బారావు, సభ్యులు సన్మానించారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి దంపతులు

లక్కవరపుకోట: మండలంలోని వీరభద్రపేట-లక్ష్మీపురం గ్రామాల మధ్య గెడ్డపై వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి,ఆమె భర్త రాంప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ సుమారు కోటి రూపాయలు అంచనా వ్యయంతో వంతెన నిర్మించనున్నట్లు చెప్పారు. పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మాజీ జెడ్పీటీసీ కొరెడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

104 వాహన షెడ్ ప్రారంభం

శృంగవరపుకోట: 104 వాహనం కోసం పట్టణంలోని పెద్దవీధి రామాలయం వద్ద పంచాయితీ నిధులతో నిర్మించిన షెడ్‌ను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును ప్రారంభించి, మరో రెండు బోర్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్,చమురు ధరల పెంపుపై నిరసన



వేపాడ: బొద్దాంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



శృంగవరపుకోట ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నేతలు



గజపతినగరం : పురిటిపెంటలో నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఎం నాయకులు

కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు పెల్లుబికాయి. ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో సీపీఎం నేతలు గాడి అప్పారావు, మద్దిల రమణ, వేపాడ మండలంలోని బొద్దాం జంక్షన్ వద్ద ఎస్.కోట-కొత్తవలస ప్రధాన రహదారిలో సీపీఎం నేత చల్లా జగన్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామంలో స్థానిక మహిళలతో కలిసి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి. శ్రీనివాస్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కి రూ.2 చొప్పున పెంచి కేంద్రప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిసిందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఆస్తులు పెంచాలన్న యావే తప్ప సామాన్యులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఒక పక్క పెరిగిన నిత్యవసరాల ధరలతో, విద్యుత్ చార్జీల వడ్డనతో సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే తాజాగా గ్యాస్, చమురు ధరలను పెంచేశారని మండిపడ్డారు. ఎన్నికల ముందు పేదలకు ఎన్నో హామీలు ఇచ్చి రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాలు నిస్సిగ్గుగా ప్రజలను దోచుకుంటు న్నాయన్నారు. పెంచిన ధరలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీపీఎం, ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట/వేపాడ/గజపతినగరం

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి డైరీలు, లెసన్‌ప్లాన్స్, టీచింగ్ నోట్స్, పర్సనల్ మార్క్ రిజిస్టర్ తదితర అంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఎంఈఓ నాగభూషణం అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు గ్రామాల్లో అడ్మిషన్‌ల డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ- 2 బాల భాస్కరరావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పీఎండీఎస్ కిట్లు



వేపాడ: వలంపూడిలో నవధాన్యాల విత్తనాలను చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ మహిళా సిబ్బంది

- ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



వేపాడ: వేపాడలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వేపాడ: పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు అవసరమైన ఏడు రకాల విత్తనాల కిట్లను రైతుల కోసం రైతు సేవాకేంద్రాల్లో వీటిని అందుబాటులో ఉంచామని ఏఓ సి.బి. యశ్వంతరావు, అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ స్వామి నాయుడు తెలిపారు. సోంపురం,వల్లంపూడి, నీలకంఠరాజపురం,వేపాడ రైతు సేవా కేంద్రాల్లో రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయం, విత్తన యాజమాన్యపద్ధతులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 5వేల ఎకరాల విస్తీర్ణంలో తొలకరిలో నువ్వులు, నవధాన్యాలు సాగు చేసేందుకు ఐదువేల విత్తన కిట్లను రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. వంద రూపాయలకే విత్తనాల కిట్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలపై గ్రామసభలు



కొత్తవలస: గనిశెట్టిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వెంకటరమణ

కొత్తవలస: ప్రకృతి వ్యవసాయ సాగు ప్రణాళికలపై మండలంలోని గనిశెట్టిపాలెం,గులివిందాడ,చీడివలస గ్రామాల్లో ఏపీఎం ఏ.వెంకటరమణ ఆధ్వ ర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, ఇతర అంశాలపై ఏపీఎం అవగాహన కల్పించారు. గనిశెట్టిపాలెం,చీడివలస గ్రామాల సర్పంచ్‌లు జామి ఈశ్వరావు,చలుమూరి అప్పలనాయుడు మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతింటుందని, ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలామేలని అన్నారు.

పది నెలల్లో ఒక్కరికైనా కొత్త పింఛన్ ఇచ్చారా...?

- అర్హుల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం
- ఈనెల 10న చీపురుపల్లిలో ధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతం, తదితరులు

చీపురుపల్లి: కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతోందని, ఒక్కరికైనా కొత్తగా ఈ ప్రభుత్వం పింఛన్ ఇచ్చిందా అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం ప్రశ్నించారు. చీపురుపల్లిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తవుతున్నా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదని, ఇది మోసం కాదా అని నిలదీశారు. వితంతువులు, దివ్యాంగులు సైతం పింఛన్ ఎప్పుడు మంజూరు చేస్తారా అని ఎదురు చూస్తున్నారన్నారు. చీపురుపల్లి మండలంలో అర్హత కలిగి, ఆన్‌లైన్ పూర్తి చేసుకుని నిరీక్షిస్తున్న 300 మంది ఇందుకు నిదర్శనమ న్నారు. వారంతా అర్హులు కాకపోతే చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు పింఛన్‌లు మంజూరు చేస్తారో లేదో స్పష్టత ఇవ్వాలన్నారు. నిత్యావసరాల ధరలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ధరలు పెంచేశారని, తాజాగా వంట గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.50 పెంచి పేదలపై కూటమి ప్రభుత్వం భారం మోపిందన్నారు. దాదాపు 80 రోజులుగా ఉపాధి హామీ పథకం వేతనదారులకు వేతనాలు అంద కపోవడంతో వారంతా ఆకలితో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీపురుపల్లి మండలంలో 11వేల మందికి ప్రభుత్వం ఉపాధి వేతనాలను పెండింగ్‌లో ఉంచిం దని చెప్పారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేశారని, దీంతో పేదలకు వైద్యం అందడం లేదన్నారు. ప్రజా సమస్యలపై, పథకాల అమలు గురించి పట్టించుకోని ప్రభుత్వం గ్రామాల్లో మద్యాన్ని మాత్రం ఏరు లై పారిస్తోందని మండిపడ్డారు. కూటమి నాయకులే దగ్గరుండి గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించి బెల్టు దుకాణాలు దర్జాగా నడిపిస్తున్నారని ఆరోపించారు.

ఈనెల 10న ధర్నా

పింఛన్‌లు కోసం ఎదురు చూస్తున్న అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధుల తరఫున ఈ నెల 10న చీపురుపల్లిలో ధర్నా నిర్వహించనున్నట్లు అనంతం తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి మూడు రోడ్ల జంక్షన్‌లో నిరసన లు చేపట్టి, అక్కడి నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాన్వాయ్ కోసం రెండు గంటల పాటు సాధారణ రాకపోకలు నిలిపివేయడంతో 30 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరు కాలేకపోయారన్నారు. వారి భవిష్యత్‌కి నష్టం కలిగించిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, చందక గురునాయుడు, అధికార్ల శ్రీనుబాబు, రఘుమండ త్రినాథ్, రేవల్ల సత్తిబాబు, కోరుకొండ దాలయ్య, ముల్లు పైడిరాజు, కొమ్ము చిరంజీవి, ఎల్.ప్రభాత్ పాల్గొన్నారు.